



ఫతేనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అభివృద్ధితో పాటు పింఛన్లు ఇస్తున్నాం

• ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • డివిజన్లను ఎంతో అభివృద్ధి చేశాం



ఎమ్మెల్యేకు తమ మద్దతు ప్రకటించి పూలమాలలు వేసి సన్మానిస్తున్న మక్కాల సత్యనారాయణ, ప్రభు, పీటర్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి సోమవారం డివిజన్‌లోని పలు కాలనీలు, అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అందులో భాగంగా భరత్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్స్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం జేపీనగర్, భవానీనగర్, ఎల్‌బీఎస్‌నగర్, ఇందిరాగాంధీ పురం, సమతానగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడారు.

◆ ఒకప్పుడు ఫతేనగర్ డివిజన్ ఏ విధంగా ఉంది? ప్రస్తుతం ఏ విధంగా అభివృద్ధి చెందిందో పోల్చుకొని చూడాలన్నారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. 60ఏళ్లుగా పాలించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల గురించి ఆలోచించిన పాపాన పోలేదని కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ పదేళ్ల కాలంలో ఇంత అభివృద్ధి చేసుకున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే దానిని పరిష్కరించే దిశగా ముందుకెళ్తున్నామని అన్నారు.

◆ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలకు విఘాతం కలగడం లేదన్నారు. దీంతో ప్రజలు ఎంతో హాయిగా జీవిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పరిపాలించిన రోజుల్లో ఎక్కడ ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో ఉండేదన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. అదే విధంగా హైదరాబాద్‌లో మరో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు అందుతుందన్నారు. అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు అంజయ్యనగర్ చర్చి ప్రతినిధుల మద్దతు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: క్రిష్టి రుహా మినిస్ట్రీ అంజయ్యనగర్ చర్చి క్రిష్టియన్లు సోమవారం అంజయ్యనగర్ రిటైల్ మార్కెట్ శ్రీ కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ మక్కాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలసి మద్దతు ప్రకటించారు. చర్చి సభ్యులైన 150 మంది ఎమ్మెల్యే గెలవాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మక్కాల సత్యనారాయణ మాట్లాడుతూ.. తన తండ్రి నర్సింహ చర్చి నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని చెప్పారని.. ఆయన మాటను నిలబెట్టుకుంటానన్నారు. వంద గజాలు ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ పీటర్, ప్రభు, బాస్కర్, లమీర్ జైన్, నర్సింహ, అనమణి, సెల్వరాజు, వెంకట్‌రావు, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శేరలింగంపల్లిలో కాంగ్రెస్‌దే గెలుపు

ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: వివేకానందగర్ డివిజన్ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్‌లోని మహిళలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకుంటోందన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించడానికి ఎదురు చూస్తున్నారని అన్నారు.

అరెకపూడి గాంధీని మళ్లీ గెలిపిద్దాం

కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



వివేకానందనగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో కార్పొరేటర్ రోజాదేవి రంగారావు సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మరోసారి మూడోసారి రాష్ట్రంలో కేసీఆర్‌ను, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అరెకపూడి గాంధీని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా గాంధీని గెలిపిస్తే రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, నాయినేని చంద్రకాంత్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి అభివృద్ధి ప్రదాత కృష్ణారావు



కూకట్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని శేషాద్రినగర్‌కాలనీలో సోమవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి అభివృద్ధి ప్రదాత మాధవరం కృష్ణారావు అని అన్నారు. అందుకే కారు గుర్తుకే ఓటు వేసి ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి ఎస్సీసెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కుముదిని దేవి నర్సింగ్ కళాశాల ప్రారంభం



రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రిలో నర్సింగ్ కళాశాల, పాఠశాలను ప్రారంభిస్తున్న ట్రస్టు సభ్యులు

ఆల్విన్‌కాలనీ: రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి యాజమాన్యం తమ సేవలను మరింత విస్తృతం చేయడానికి సేవా రంగంలో సోమవారం మరో అడుగు ముందుకేసింది. చైతన్య మెమోరియల్ ట్రస్ట్, రాందేవ్‌రావ్ ఆస్పత్రి సంయుక్తంగా కుముదిని దేవి నర్సింగ్ కళాశాల, పాఠశాలను ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్ల జీఎన్ఎం కోర్సు, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సును ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే తీసుకొని విద్యను అందిస్తామన్నారు. విద్యార్థులకు అత్యాధునిక బిల్డింగ్, హాస్టల్ సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన అధ్యాపకులు, అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం, సువిశాలమైన ప్రాంగణంలో నర్సింగ్ కోర్సును ప్రారంభించామన్నారు.

◆ నర్సింగ్ కళాశాలకు అత్యంత అనుభవజ్ఞులైన డా.క్వీన్ మేరీని ప్రిన్సిపల్‌గా నియమించినట్లు తెలిపారు. నాలుగు అంతస్తుల భవనాన్ని జె. విక్రందేవ్ ప్రారంభించారు. అన్ని విధాలుగా భద్రత కలిగిన హాస్టల్ భవనాన్ని మీరారావ్ ప్రారంభించారు. హైదరాబాద్ తొలి మహిళా మేయర్ కుముదిని దేవి చిత్రపటాన్ని జె. అపర్ణ రావ్ ఆవిష్కరించారు. చైతన్య ట్రస్ట్ సభ్యులు, రాందేవ్‌రావ్ ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు, ఆస్పత్రి ఎండీ డా. కె. కమలాకర్, సీఈఓ డా. యోబు, అడ్మిన్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ పునర్‌నిర్మాణ పూజలు

మూసాపేట: మూసాపేట డివిజన్ ముష్కిపేటలోని పోచమ్మ తల్లి, ఎల్లమ్మతల్లి ఆలయం పునర్ నిర్మాణం కోసం మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, అనంతరం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన ఉంటుందని తెలిపారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నేత అషు మృతి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ బీ–బ్లాక్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అషు సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం అషు పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, నాయకులు సయ్యద్ రియాజ్, మహమ్మద్ అబ్దుల్ అమీన్, చోటా షరీఫ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్ ముస్లిం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కథక్ డ్యాన్స్ వర్క్‌షాప్

రాయదుర్గం: కథక్ నృత్య ప్రదర్శన విద్యార్థులు, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకుంది. గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయంలో సోమవారం కథక్ డ్యాన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులోని ప్రాథమిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

నామినేషన్ల స్వీకరణ

దాఖలు చేసిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు



సీహెచ్. చంద్రశేఖర్



సీహెచ్. పార్వతి



సుధాకర్‌యాదవ్

కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సోమవారం ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. సీహెచ్. చంద్రశేఖర్, సీహెచ్. పార్వతి, సుధాకర్‌యాదవ్ నామినేషన్‌లు దాఖలు చేశారు. మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. – కూకట్‌పల్లి

తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్



హైదర్‌నగర్ డివిజన్‌లో పలువురు సీనియర్ నాయకులను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఎం. భిక్షపతి యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ పార్టీతోనే సాధ్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం. భిక్షపతి యాదవ్ అన్నారు. సోమవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలువురు సీనియర్ నాయకలను ఆయన ప్రత్యేకంగా కలిసి బీజేపీ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధిలోకి దూసుకుపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బొల్లేపల్లి సీతారామరాజు, నరసింహాచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్ నంది అవార్డు ప్రదానోత్సవం



ఏఎన్‌ఆర్ నంది అవార్డును నిర్వాహకుల నుంచి అందుకుంటున్న హిమగిరిరావు

కూకట్‌పల్లి: దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కళానిలయం సాంస్కృతిక సంఘం సేవా సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లికి చెందిన మొలుగు హిమగిరిరావుకు వంశీ ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్ వంశీ రామరాజు, ప్రఖ్యాత న్యూరోమోరోలజిస్టు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా ఏఎన్‌ఆర్ నంది అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హిమగిరిరావు మాట్లాడుతూ... అక్కినేని లాంటి లెజెండ్రీ పేరు మీద నంది అవార్డు అందుకోవటం పూర్వజన్మ సుకృతమన్నారు. తనకు అవార్డు అందజేసిన కళానిలయం ప్రముఖులకు హిగిరిరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆరు గ్యారంటీలపై బండి మనస్విని అవగాహన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో యువ నాయకురాలు బండి మనస్విని పాల్గొని కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇస్తానన్న ఆరు పథకాలను వివరించి అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలే పునాదులని ఆమె అన్నారు. పార్టీని గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని.. అది కేవలం ఒక కుటుంబానికి పరిమితమైందని తెలిపారు.



కాంగ్రెస్ పార్టీ పథకాలను మహిళలకు వివరించిన యువ నాయకురాలు బండి మనస్విని

శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు దొడ్ల రామ్మకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి గులాబి కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్ యాదవ్, గుడ్ల శ్రీనివాస్, బోయ కిషన్, ప్రదీప్‌రెడ్డి, లకాన్‌సింగ్, యాదగిరి, దాతి రమేష్, అశోక్, షఫీ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్
- ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం
- కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ వస్తున్న ఆదరణను చూసి బీఆర్‌ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. అతి తక్కువ కాలంలోనే నియోజకవర్గం అంతా తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నానని తెలిపారు. ఈ సమస్యలను అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యకర్తలు పార్టీ విజయానికి సమష్టిగా పని చేయాలని సూచించారు. ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై మూసాపేట డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు నజీర్ ఆధ్వర్యంలో 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో కారుకు పంక్చర్ అయిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్లు పాలించిన తమకు ఏ సంక్షేమం అందలేదన్నారు.

◆ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లు రవి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. గెలిచిన తర్వాత గృహలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2500 అకౌంట్లో జమ చేస్తామన్నారు. వంటగ్యాస్ రూ.500లకే ఇస్తుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. వృద్ధుల పెన్షన్ రూ.4వేల ఇస్తామన్నారు. విద్యార్థులకు ఉన్నత చదువులకు రూ.5లక్షలను యువ వికాస్ కార్డు ద్వారా అందిస్తామన్నారు. కౌలు రైతుకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు అందిస్తుందన్నారు. అందుకే బండి రమేష్‌ను గెలిపించి సోనియమ్మకు గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు.

◆ టీపీసీసి ప్రతినిధి సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ కుటుంబ పాలనను పారదోలాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. బండి రమేష్‌ని గెలిపించుకొని ఈ కబ్జారాయుళ్ల బారి నుంచి కూకట్‌పల్లిని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్, మల్లు రవి, హాజరైన నాయకులు

కాంగ్రెస్‌లోకి మూసాపేట బీఆర్‌ఎస్ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మూసాపేట డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు, కేసీఆర్ సెక్రటరీగా సేవలు అందించిన మహమ్మద్ నసీర్ ఉద్దీన్‌తో పాటు సుమారు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వారికి పార్టీ కండువాలు కప్పి కాంగెస్‌లోకి ఆహ్వానించారు. విష్ణు వర్ధన్, సాయికుమార్, కవిత, యుగంధర్, కిషోర్, ఉషారాణి, రామారావు, కృష్ణ వేణి, బాలకృష్ణ, సాయి రామ్, సుందర్‌రావు, మోహన్‌దాస్, సుజాత, వెంకట్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లోకి తెలుగు యువత మాజీ జనరల్ సెక్రటరీ ప్రభాకర్

మూసాపేట: కూకట్‌పల్లి ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు మల్లు రవిల సమక్షంలో మూసాపేటకు చెందిన రంగారెడ్డి జిల్లా తెలుగు యువత మాజీ జనరల్ సెక్రటరీ బాశెట్టి ప్రభాకర్, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో కాంగెస్‌లో చేరారు. వీరందరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మహమ్మద్ నసీర్ ఉద్దీన్



మహేష్‌కుమార్, మల్లు రవిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బాశెట్టి ప్రభాకర్

పీజేఆర్‌లా సేవలు అందిస్తున్న వ్యక్తి ఎమ్మెల్యే కృష్ణారావు

బీఆర్‌ఎస్ నాయకుడు అమ్రేష్ గౌడ్

కూకట్‌పల్లి: ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పీజేఆర్ ఎనలేని సేవలు అందించారని.. అదే విధంగా ఇప్పుడు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పీజేఆర్‌ను తలపించే విధంగా సేవలు అందిస్తున్నారని పార్టీ సీనియర్ నాయకుడు కూన అమ్రేష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కూకట్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నా అంటే నేనున్నానంటూ పలికే నాయకుడు కృష్ణారావు కొనియాడారు. రాజకీయాల్లో ఎందరో వస్తుంటారు.. పోతుంటారు కాని మాధవరం కృష్ణారావు మాత్రమే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి అన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా నేనున్నా అంటూ ఆ సమస్యను పరిష్కరించేందుకు ముందుంటారని తెలిపారు. కష్టాల్లో ఉన్న వారికి తన స్వంత డబ్బులు ఖర్చు పెట్టి వారి బాధలు తీరుస్తున్నారన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న మాధవరం కృష్ణారావును మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకొని మరిన్ని సేవలు చేసే విధంగా ఓటు వేసి గెలిపించుకుందామన్నారు.

ఎమ్మెల్యేగా గాంధీని మూడోసారి గెలిపించుకుందాం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ గెలుపుకోసం హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీని వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. నిత్యం అందుబాటులో హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించారని తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు డివిజన్‌లో పలువురికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అభిమానులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హైదర్‌నగర్‌లో జరిగిన ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు